కథా నిలయం
శ్రీకాకుళం

# తూనిక నీళ్ళు

ఆ ఇంట్లో చేరి సంవత్సరన్నర దాటింది. రెండు చిన్నగదుల ఇల్లు. వీధి చివరన ఉంది. బ్రహ్మచారిని అవడం వలన నా మాటుకు సరిపోయేది. స్నేహితులు, బంధువులు వచ్చినప్పుడు ఇబ్బందిగా ఉండేది. నీళ్ళు అంతంత మాత్రంగానే వచ్చేవి. బోరింగ్ సదుపాయం లేదు. నీటికి ఇబ్బందిగానే ఉండేది. ఇల్లు గలాయనరెండు మూడు నెలలకొకసారి గాని రాడు. అద్దె ఇస్తూ నీళ్ళ విషయం అడిగితే 'తప్పకుండా చూస్తాను' అంటాడే గాని మర్చిపోతుంటాడు. చెప్పీ చెప్పీ విసుగుపుడుతోంది.

ఇల్లు మారడం మంచిదనిపించి అక్కడక్కడ కొన్ని ఇళ్ళు చూశాను. కొన్ని బాగా లేవు. బావున్న వాటి అద్దె ఎక్కువగా ఉన్నాయి. కొంతమంది బ్రహ్మచారులకు మరికొందరు శాకాహారులు కానివాళ్ళకు ఇవ్వమన్నారు. అయినా నా ప్రయత్నాలు చేయడం మానలేదు.

నేను ఉంటున్న వీధికి మూడు వీధుల అవతల రెండో ఇంటికి 'టులెట్' అని రాసి ఉన్న అట్ట చూశాక ఆ ఇల్లు దొరికితే బావుణ్ణు అనిపించింది. ఎవరిని సంప్రదించాలో ఫోను, సెల్ నెంబర్లు ఇవ్వలేదు. పక్కింటి వాళ్ళనడిగితే తమకూ తెలియదన్నారు. అతను అప్పుడప్పుడు వస్తుంటాడు కాని ఎవరితోనూ మాట్లాడడు అని జవాబు వచ్చింది. అతన్ని పట్టుకోవడం తేలికయిన పనిలా అనిపించలేదు. ఆ ఇల్లు నాకు నచ్చింది. ఆ ఇల్లు కట్టి పదిహేను సంవత్సరాలు అయి ఉంటుంది. ఇంటి చుట్టూ ప్రహరీగోడ ఉంది. ఇంటిముందు రకరకాల పూలమొక్కలు పిచ్చిగా పెరిగి ఉన్నాయి. వీధి తలుపుకు తెల్లటి తాళం కప్ప వేసి ఉంది.

మూడు రోజుల తర్వాత ఉదయం ఎనిమిది గంటలప్పుడు ప్రహరీగోడ చెక్క తలుపు నెట్టుకుని ఇంటి ఆవరణలోపలికి నడిచాను. వీధి తలుపుకు తాళం కప్ప లేదు. సంతోషం వేసింది. ఎలా అయితేనేం ఇల్లు గలాయనను కలుసుకుని మాట్లాడబోతున్నాను.

చాలారోజులనుండి ఆ ఇంట్లో ఎవరూ ఉన్నట్టు కనిపించలేదు. మెట్లు ఎక్కి వరండా గ్రిల్స్ నెట్టగానే తెరుచుకుంది. కాలింగ్‌బెల్ లేదు. వరండాలో మడత కుర్చీ, దాని ఎదురుగా స్టూలుకన్నా పెద్దగా ఉన్న బల్ల ఉంది. దానిమీద దినపత్రిక, అది గాలికి ఎగిరిపోకుండా సిగరెట్ పీకలతో నిండిన ఏష్‌ట్రే ఉంది. గోడకు నల్లటి గొడుగు ఆనించి ఉంది.

లోపలికి వచ్చి గోడవారగా చెప్పులుంచి, "ఏమండీ" పిలిచాను. ఎవరూ సమాధానమివ్వలేదు. తలుపు దగ్గరకు వచ్చి మళ్ళీ పిలిచాను. జవాబు లేదు. తలుపు తట్టాను. తలుపు తెరుచుకుందిగాని ఎవరూ కనిపించలేదు. ఎదురుగా పెరటివైపు తెరవబడి ఉన్న తలుపు ఉంది. మూడు గదుల ఇల్లు. అంతకు ముందే తుడిచినట్టు శుభ్రంగా ఉంది. మధ్య గదిలో ఒక పక్కగా ఉన్న చెక్క బీరువాల నిండా తెలుగు పుస్తకాలు చక్కగా పేర్చబడి ఉన్నాయి. బీరువాల చివర్లో పాత దిన, వారపత్రికలు వరసగా పెట్టి ఉన్నాయి. వాటి పక్కనే మరో నల్లగొడుగు తెరిచి ఉంది.

ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. ఇంట్లో ఎవరూ ఉన్నట్టు అనిపించడం లేదు. ఎవరూ లేని ఇంట్లో జొరబడ్డానా? ఒకవేళ అతను స్నానాల గదిలో స్నానం చేస్తోంటే నీళ్ళ చప్పుడు అవుతూ ఉండేది. అదీలేదు. మళ్ళీ పిలుస్తూ లోపలికి నడిచాను. స్నానాలగదిలో స్నానం చేస్తోంటే నీళ్ళ చప్పుడు అవుతూ ఉండేది. లేదు. మళ్ళీ పిలుస్తూ లోపలికి నడిచాను. స్నానాల గది తలుపు తెరుచుకునే ఉంది. శబ్దం కాకుండా నీళ్ళు బొక్కెనలో పడడానికి తాడులాంటి రబ్బరు కట్టి ఉంది. రెండు బాల్చీల నిండా నీళ్ళు పట్టి ఉన్నాయి. గోడకున్న కొక్కానికి నల్లటి రెయిన్‌కోట్, మరో నల్ల గొడుగు తగిలించి ఉన్నాయి.

ఇంటి వెనకకు వచ్చాను. పెరడంతా అరటిచెట్లతో నిండి ఉంది. ఒకటి కాదు. రెండు కుళాయిల్లోంచి నీళ్ళు అరటిచెట్ల మధ్యకు వెళ్తున్నాయి. నీటికి ఎటువంటి ఇబ్బంది ఉన్నట్టు అనిపించలేదు. అతను చెట్ల మధ్య ఎక్కడయినా ఉన్నాడేమోనని స్వరం పెంచి పిలిచాను. నిశ్శబ్దమే పలికింది. ఇంట్లో బయటా అతను లేదు. సిగరెట్లు తాగే అలవాటు ఉండటాన అవి అయిపోతే తెచ్చుకోడానికో, మరి దేనికో బయటకు వెళ్ళి ఉండాలి.

అయినా బయటంతా కలయచూశాను. ఎక్కడా లేదు. మధ్యగదిలోకి వచ్చి అక్కడ ఉన్న కుర్చీలో అతను తిరిగి వచ్చేవరకు కూర్చుందామనుకుంటూ కిటికీ వైపు చూశాను. కిటికీ కింది తలుపులు వేసి ఉన్నాయి. కిటికీ పక్కన ఉన్న అరలో వెయ్యిరూపాయల నోటు ఉంది. దాని మీద రంగుల పేపర్ వెయిట్ ఉంది.

అక్కడ కూర్చోవాలనిపించలేదు. వరండాలోకి పోబోతూ ఆగాను. నా చూపు వెయ్యిరూపాయల నోటు మీద ఆగింది. నాకు దొంగబుద్ధి లేదు. ఎప్పుడో చిన్నప్పుడు మూడు నాలుగుసార్లు తెలియక దొంగతనం చేసి అమ్మానాన్నల చేత తిన్న తన్నులు ఇంకా గుర్తుఉన్నాయి. నా ఊహ తెలిశాక దొంగతనం చేయలేదు.

కాకపోతే ప్రస్తుతం ఇంట్లో ఎవరూ లేరు. నిగ్రహించుకోలేకపోయాను. రంగుల పేపర్‌వెయిట్ కిందున్న వెయ్యి రూపాయల నోటు అందుకుంటోంటే పేపర్‌వెయిట్ కిందపడేసరికి నా గుండె ఝల్లుమంది. అది పగిలి ముక్కలయిందనే అనుకున్నాను. పేపర్ వెయిట్ అందుకున్నాను. ఏం కాలేదు. అరలో పెట్టి వరండాలోకి వచ్చాను. నా గుండె వేగంగా కొట్టుకోవడం నాకే స్పష్టంగా వినిపిస్తోంది. చెప్పులు తొడుక్కుని బయటకి వచ్చి వెనక్కి తిరిగి చూశాను. ఎవరూ

కనపడలేదు. వీధిలోకి వచ్చాను. వీధి నిర్మానుష్యంగా ఉంది. ఎక్కడా ఆగలేదు. సరాసరి ఆఫీసుకు వెళ్ళిపోయాను. ఆఫీసులో ఏ పనిమీదా నా మనసు నిలవలేదు. వెయ్యి రూపాయల నోటు బరువుగా తయారయింది. జేబులో ఉంచుకోడానికి ఇబ్బంది అనిపించి నా బల్ల సొరుగులో పెట్టాక మనసు నెమ్మదయినట్టనిపించింది. సాయంత్రం ఇంటికి తిరిగి వెళ్ళేప్పుడు అతనింటికి వెళ్ళి ఆ నోటు ఎక్కడినుండి తీశానో అక్కడే పెట్టేయడం మంచిదనిపించింది. అతను ఇంట్లో ఉండకపోతే? తలుపుకు తాళం వేసి ఉంటేనో? ఎంత ఆలోచించినా జవాబు తట్టలేదు. సాయంత్రం ఆఫీసు అయిన వెంటనే ఇంటికి బయల్దేరబోతుండగా కొత్త పని చేయవలసి వచ్చినందున ఎనిమిదింటి వరకు ఆఫీసులోనే ఉండవలసి వచ్చింది. అటునుండి అటు హొటలుకు వెళ్ళి భోజనం చేసి మా ఇంటికి వెళ్తూ ఉదయం నేను వెళ్ళిన ఇంటిదగ్గరకు రాగానే వెయ్యిరూపాయల నోటు పెట్టవలసిన విషయం గుర్తు వచ్చింది. ఆఫీసునుండి బయటకు వచ్చేముందు ఆ నోటు జేబులో పెట్టుకున్నాను. ఇంట్లో లైటు వెలుగుతోంటే ఇంట్లోకి వెళ్ళడానికి ధైర్యం చాలలేదు. రేపు పెడదాం అనుకుని మా ఇంటికి వెళ్ళిపోయాను.

పడకమీద చేరిన వెంటనే నిద్ర పట్టింది. ఎంతసేపు నిద్రపోయి ఉంటానో తెలియదు. ఇంటి తలుపు ఎవరో తడుతూ ఉంటే మెలకువ వచ్చింది. మంచం దిగాను. నిద్రమత్తు పూర్తిగా వదలలేదు. బయటి లైటు వెలిగించి తలుపు తెరిచాను.

వర్షం కురుస్తున్నట్లుగా ఉంది. వరండాలో రెయిన్‌కోటు తొడుక్కుని చేతిలో నల్లటి గొడుగు పట్టుకుని ఉన్న వ్యక్తి కనిపించాడు. నీడలో నుంచుని ఉండడం వలన అతని ముఖం స్పష్టంగా కనిపించడంలేదు.

"నా వెయ్యి రూపాయలు ఎందుకు దొంగిలించావు?" గొంతు బొంగురుగా ఉండి మాట కటువుగా ఉంది.

"పొరపాటు చేశాను. క్షమించండి..." నా గొంతు ఎండిపోతోంది. "మీరు ఒక్క నిమిషం ఆగితే మీ నోటు మీకు తిరిగిచ్చేస్తాను..." అంటున్నాను. నా మాటలకు అడ్డు తగిలి, "ఆగను. రేపు ఉదయాన్నే తీసుకువచ్చి ఇవ్వకపోతే మర్యాదగా ఉండదు. ఎక్కడినుండి తీశావో అక్కడే పెట్టేయి" కోపంగా అన్నాడు.

"మీరూ..." అన్నాను.

అతను వినే ఉంటాడు. ఆగలేదు. విసురుగా వెళ్ళిపోయాడు. తలుపు వేసి బయట లైట్లు ఆర్పి వచ్చి మంచం మీద పడుకున్నాను. చాలాసేపటివరకు నిద్రపట్టలేదు.

ఉదయం త్వరగా లేచి సరాసరి అతనింటికి వెళ్ళాను. ఇంటి తలుపు తెరిచే ఉంది. "ఏమండీ" పిలిచాను. జవాబు లేదు. లోపలికి నడిచి, జేబులోంచి నోటు తీసి రంగుల పేపర్ వెయిట్ అందుకోబోతూ ఆగాను. లెక్కపెట్టాలని అనిపించలేదు కాని దానికింద మరికొన్ని వెయ్యిరూపాయల నోట్లు ఉన్నాయి.

***ఆదివారం 'ఆంధ్రప్రభ', 8 జూన్, 2014***